క్లుప్తంగా

ఇంటర్ సర్కిల్ అథ్లెటిక్ మీట్‌లో విద్యుత్ ఉద్యోగుల ప్రతిభ



ఇంటర్ సర్కిల్ అథ్లెటిక్ మీట్‌లో విజేతలుగా నిలిచిన విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్: విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 24 వరకూ నెల్లూరులో జరిగిన ఇంటర్ సర్కిల్ అథ్లెటిక్ మీట్‌లో కడప ఆపరేషన్ సర్కిల్ ఉద్యోగులు ప్రతిభ చూపారు. సబ్ ఇంజినీర్ రామకృష్ణ జావెలిన్ త్రోలో తృతీయ స్థానం సాధించగా, డిస్కస్ త్రోలో జేఎల్ఎం హుస్సేన్ ద్వితీయ స్థానంలో నిలిచారు.

కలెక్టర్‌ను కలిసిన వీసీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్

ఏఎఫ్‌యూ: డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ శుక్రవారం కలెక్టర్ వి. విజయరామరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకారం అందించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో ల్యాబ్ ఏర్పాటుకు సహకారం అందించడంపై ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేత



ఆశా నిలయానికి సరుకులు అందజేస్తున్న స్నేహం ఫౌండేషన్ ప్రతినిధులు, దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్: స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని పలు శరణాలయాలకు నిత్యావసర సరుకులు అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రసన్న తెలిపారు. గాజుల వెంకటసుబ్బమ్మ కుమారుడు గాజుల రవితేజ తోడ్పాటు, అమెరికాకు చెందిన రాబిన్ హుడ్ సంస్థ వ్యవస్థాపకులు మోన సహకారంతో శుక్రవారం నగరంలోని ఆశా నిలయం, బృంద వృద్ధాశ్రమం, బాయ్స్ అర్బన్ హాస్టల్, శిశుగృహాలకు లక్షా 4 వేల రూపాయలు విలువజేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత వెంకట సుబ్బమ్మతోపాటు శరణాలయాల నిర్వాహకులు బాలసుబ్బయ్య, సుధారాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగ్గించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మరింత పేదరికంలోకి తీసుకెళ్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మండిపడ్డారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర వార్షిక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్, యూజర్ చార్జీలు, గ్యాస్ ధరల పెంపు, యూజర్ చార్జీల పేరుతో వేసిన భారాలను తగ్గించాలని ప్రభుత్వాలను కోరారు. మోదీ ప్రభుత్వ అండతో అంబానీ, అదానీలు దేశ సంపదను లూటీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని సూచించారు. సీపీఎం నాయకులు బి. నారాయణ, రామ్మోహన్, మనోహర్, దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, వీరణాల శివ కుమార్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

వీరపునాయునిపల్లి : మండలంలోని పాయసంపల్లెలో కడప నగరానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు విద్యాసాగర్‌రెడ్డి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎక్స్‌రే తీసి వ్యాధి తీవ్రతను బట్టి వారికి మందులను అందజేశారు. అనంతరం కీళ్ల వ్యాధులపై ప్రజలకు ఆవగాహన కల్పించారు. గుడ్లు, పాలు, ఆకుకూరలు బాగా తీసుకోవాలని, వ్యాయామం తప్పని సరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో వేగం.. ప్రజల్లో హర్షం

అభివృద్ధిలో ఆదర్శంగా 20వ డివిజన్
- రూ.6.65 కోట్లతో పూర్తి కావొచ్చిన పనులు
- ఒకట్రెండు మాసాల్లో మిగతా పనులు పూర్తి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 20వ డివిజన్ అభివృద్ధిలో ఆదర్శంగా ముందుకెళుతోంది. ఏపీహెచ్‌బీ కాలనీ, మారుతీనగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాలు ఈ డివిజన్ పరిధిలోకి వస్తాయి. ఈ ఒక్క డివిజన్‌లోనే సుమారు రూ.6.65కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యే దశకు చేరుకోగా, చాలా పనులు పూర్తయ్యాయి. ముఖ్యంగా రాజీవ్ మార్గ్ రోడ్ అభివృద్ధి పనులు రూ.4.50కోట్లతో మొదలు పెట్టగా, ప్రస్తుతం ఇరువైపులా సిమెంటు రోడ్లు, డివైడర్ వాల్స్ పూర్తయ్యాయి. ఫుట్‌పాత్, డివైడర్లు, కల్వర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాజీవ్ మార్గ్ పక్కనే ఉన్న రాజీవ్ పార్కును రూ.70లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ప్లే ఏరియా, జిమ్, బొలార్డ్స్, డెకరేటివ్ ల్యాంప్స్, హైమాస్ లైట్లు, గజిబోలు, వాటర్ ఫౌంటేన్, ఫ్లవర్ గార్డెన్, పాత్ వేలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. అలాగే రూ.90లక్షలతో చేపట్టిన అర్బన్ హెల్త్ సెంటర్ పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.20లక్షలతో, జనరల్ ఫండ్ ద్వారా రూ.15లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు.



పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం



రాజీవ్ మార్గ్‌లో పూర్తయిన రోడ్లు, డివైడర్లు



రాజీవ్ పార్కులో పూర్తయిన అభివృద్ధి పనులు

అభివృద్ధికి సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు

తాను కార్పొరేటర్ అయినప్పటి నుంచి ఇప్పటివరకూ డివిజన్‌లో రూ.6.65కోట్ల పనులను చేపట్టడం జరిగింది. ఇందులో 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. అభివృద్ధి పరంగా కొన్ని సమస్యలు వచ్చినా అర్థం చేసుకుని సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు. డివిజన్ సమస్యలు తెలిపిన వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ప్రవీణ్‌చంద్‌లకు ధన్యవాదాలు.

– వై. మాధవి, కార్పొరేటర్, 20వ డివిజన్.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

– డిగ్రీ విద్య ఆర్‌జేడీ పి. బాబు

వైవీయూ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉన్నతవిద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. బాబు పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో రసాయనశాస్త్రశాఖ, ఐ.సి.ఎ.స్.ఎస్.ఆర్ సహకారంతో 'పొల్యూషన్ కంట్రోల్ అండ్ సస్టెయినబుల్ ఎన్విరాన్‌మెంట్' అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ కాలుష్య సమస్యకు ఇలాంటి సదస్సులు పరిష్కారం చూపాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యానికి మనందరం బాధ్యులమేనన్నారు. అదే విధంగా కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన తిరుపతి ఐఐటీ కెమిస్ట్రీశాఖ అధ్యాపకులు డాక్టర్ కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధునాతన విధానాల గురించి వివరించారు. సదస్సు డైరెక్టర్ డా. సి. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 100కుపైగా పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు ఆచార్య ఎం.వి. శంకర్, డా. టి. చంద్రశేకర్, కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి డా. జె. వెంకటలక్ష్మి, డా. మహేష్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ, అధ్యాపకులు

రేపు వ్యారికోస్ వెయిన్స్ వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ వ్యారికోస్ వెయిన్స్ వైద్య నిపుణులు బి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఎర్రముక్కపల్లెలోగల తమ హాస్పిటల్‌లో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రైమ్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. ఈ శిబిరంలో చూపించుకున్న మొదటి 20 రిజిస్ట్రేషన్‌కు లేజర్ సర్జరీలో 20 శాతం రాయితీ ఇస్తారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9398008129 నెంబరులో సంప్రదించాలని కోరారు.

వాహనాల తనిఖీ



వాహనదారుల రికార్డులను పరిశీలిస్తున్న చిన్నచౌక్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్‌లో ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులు, ఇన్సూ్యరెన్స్‌లను ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

కడప అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా విధులను నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన వై. శ్రీనివాసులు కుటుంబానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత చెక్కును అందజేశారు. హోంగార్డు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ పూజిత నీలం పాల్గొన్నారు.



రమాదేవికి రూ. 2 లక్షల చెక్కును అందజేస్తున్న ఏఓ

వాహనాల స్పెషల్ డ్రైవ్

జిల్లాలో పోలీసులు శుక్రవారం వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై 256 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ ధరించని వారిపై 247 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న చోదకులపై 9 కేసులు నమోదు చేశారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రొద్దుటూరులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీయంఅండ్ హెచ్ఓ నాగరాజుకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులోని చాలా ఆసుపత్రులు నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నాయని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు కాపాడుకునే అవకాశం లేకుండా ఇరుకు గదుల్లో వందల మంది రోగులను కూర్చొపెట్టి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్య నారాయణ, వీరణాల శివకుమార్, రాములమ్మ, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

'మను'లో 28న నేషనల్ సైన్సు డే

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ ఉర్దూ యూనివర్సిటీలో ఈనెల 28న నేషనల్ సైన్సు డే-2023ను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కళాశాల ఆవరణలో అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ మాట్లాడుతూ సైన్స్‌డే లో భాగంగా విద్యార్థులు మోడల్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, కాన్సెప్ట్ వీడియో ప్రెజెంటేషన్ ఇవ్వొచ్చని తెలిపారు. జిల్లాలో ఉన్న స్కూల్స్, ఐటీఐ, డిప్లమోకు సంబంధించిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుం లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9398083058 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హాకీముద్దీన్ అహ్మద్, విలయత్ అలీబైగ్, డాక్టర్ సోయబ్, నసార్ ఆయూబ్, ఖాజామొయినుద్దీన్, సికిందర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డ్రై డే పాటించాలి

కమలాపురం : ప్రతి శుక్రవారం ప్రజలందరూ డ్రై-డే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి తెలిపారు. శుక్రవారం స్థానిక అక్కా నగర్‌లో జరిగిన డ్రై-డే కార్య క్రమాన్ని ఆయన పరిశీలించి ప్రజలకు డ్రై-డే గురించి అవగాహన కల్పించారు. నీరు నిల్వ చేసే పాత్రలన్నీ కడిగి శుభ్రం చేసి ఆరబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం అరుణ, ఆశాలు పాల్గొన్నారు.

కన్న తండ్రే కాలయముడు

- అల్లుడితో విభేదించి పుట్టింటికి వచ్చిన కుమార్తె
- నచ్చజెప్పినా వినకపోవడంతో గొంతు నులిమి హత్య
- తల, మొండెం వేరు చేసి నల్లమల లోయలో పడేసిన వైనం
- 15 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘాతుకం
- పెద్దయుడియంకు చెందిన తాత ఫిర్యాదుతో విచారణ



ప్రసన్న (ఫైల్)

పాణ్యం (నంద్యాల జిల్లా): అత్తింటి నుంచి విభేదించి పుట్టింటికి వచ్చిన కుమార్తెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రే దారుణంగా హత్య చేశాడు. తల్లి లేని బిడ్డను ఆదరించాల్సిన నాన్ననే ఘాతుకానికి పాల్పడ్డాడు. చెప్పిన మాట వినడం లేదని చంపేసి, మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా తల, మొండెం వేరు చేసి నల్లమల లోయలో పడేశాడు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో ఈ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆలమూరు గ్రామానికి చెందిన దేవేంద్రారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె ప్రసన్న (21)ను రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పని చేసే జిల్లెల గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కాగా కొద్ది నెలలకే ప్రసన్న తన భర్తపై విభేదించి పుట్టింటికి చేరుకుంది. పలుమార్లు పెద్ద మనుషులు, బంధువుల సమక్షంలో పంచాయితీ చేసి నచ్చజెప్పినా మెట్టినింటికి వెళ్లేందుకు ఒప్పుకోలేదు. ఈనెల 10వ తేదీన రాత్రి దేవేంద్రారెడ్డి మరోసారి కుమార్తెను బుజ్జగించే ప్రయత్నం చేశాడు. అయితే తాను వెళ్లనని ఆమె తెగేసి చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన దేవేంద్రారెడ్డి ప్రసన్న గొంతు నులిమి చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని మాయం చేసేందుకు కొందరి సాయంతో వాహనంలో నంద్యాల - గిద్దలూరు ఘాట్‌రోడ్డులో అటవీ ప్రాంతానికి తరలించారు. అయితే మృతదేహాన్ని ఎవరూ గుర్తు పట్టకుండా తల, మొండెం వేరు చేసి వేర్వేరు చోట్ల పడేసి ఏమి తెలియదన్నట్లుగా ఇంటికి చేరుకున్నారు.

తాత ఫిర్యాదుతో వెలుగులోకి..

దేవేంద్రారెడ్డి మొదటి భార్యది వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం సుంకేసుల గ్రామం. ఆమె ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె ప్రసన్నను తండ్రి దేవేంద్రారెడ్డి చదివించిపెళ్లి చేశాడు. ఇటీవల ఆయన రెండో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మెట్టినింటి నుంచి అలిగి వచ్చిన కుమార్తె పెద్దల మాట వినకపోవడంతో చంపేసి మృతదేహాన్ని అడవిలో పడేసి వచ్చాడు. అయితే పది రోజులుగా మనువరాలు ఆచూకీ లేకపోవడంతో పెద్దముడియం మండలం సుంకేసులకు చెందిన తాత శివారెడ్డి అనుమానించాడు. అల్లుడు దేవేంద్రరెడ్డిని నిలదీయగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగలోకి దిగిన పోలీసులు దేవేంద్రరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా కుమార్తెను చంపి మరి కొందరి సహకారంతో ఎవ్వరికి అనుమానం రాకుండా నల్లమల్ల ఫారెస్టులోని బొగద వద్ద పడేసినట్లు చెప్పాడు. పోలీసులు అడవిలో రెండు రోజులుగా గాలించి శుక్రవారం సాయంత్రం 300 అడుగుల లోయలో ఉన్న ప్రసన్న మొండాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవేంద్రారెడ్డిపై కేసు నమోదు చేశామని, ప్రసన్న తల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రసన్న కాపురానికి వెళ్లకపోవడానికి ప్రేమ వ్యవహారం కారణమని పోలీసులు తేల్చారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

కోట్లు విలువజేసే స్థలాలపై కబ్జాదారుల కన్ను



కడప- తిరుపతి బైపాస్ రోడ్డులో అక్రమార్కులు కూల్చివేసిన షెడ్డు

కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలో కోట్లు విలువజేసే ప్రైవేటు స్థలంలో నిర్మించిన కట్టడాలను కొందరు దుండగులు అర్ధరాత్రి కూల్చివేశారు. కూల్చివేస్తున్న విషయం తెలుసుకొని అసలు యజమానులు రావడంతో వారంతా పరారయ్యారు. రెండు యంత్రాలను స్వాధీనం చేసుకున్న యజమానులు వాటిని పోలీసులకు అప్పగించారు. బాధితులు డా. ఆంజనేయులు, పద్మనాభయ్య, సుబ్బారెడ్డిల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కడప-తిరుపతి రహదారి బైపాస్ పక్కన సర్వే నంబర్ 373,374 సర్వే నంబర్లలో ఒకటి నుంచి పది లెటర్ల పరిధిలో ఉండే హరేరామ, హరే క్రిష్ణ నగర్‌కు చెందిన స్థలంలో సుమారు 9 మందిమి స్థలాలు కొని రిజిస్ట్రేషన్లు చేసుకున్నామన్నారు. అందులో తాము చేస్తుంటే కొందరు అక్రమార్కులు రాత్రిళ్లు వచ్చి కూల్చివేస్తున్నారని, ఈ స్థలం తమదే అంటూ గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇక్కడ భూముల ధరలు అమాంతంగా పెరగడంతో 0.30 సెంట్ల స్థలం తమదని ఐదుగురు వ్యక్తులు నకిలీ పత్రాలతో ఈ స్థలానికి సంబంధం లేని వ్యక్తులతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారన్నారు. గతంలో తాము వేసిన ముళ్ల కంచెను కూడా వారు తొలగించారని, అప్పుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి రూ.30 లక్షలు వెచ్చించి నిర్మించుకున్న షెడ్డు, ప్రహరీలను కూల్చివేసి నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారుల నుంచి తమ స్థలానికి రక్షణ కల్పించాలని వారు కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మాచుపల్లి రోడ్‌లో డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఇది వరకే మొదలు పెట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన రాజీవ్ పార్కు, రాజీవ్ మార్గ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఏపీహెచ్‌బీ కాలనీలో విజయమ్మ పార్కులో నిర్మించిన పాత్ వే పరిశీలించారు. దానికి ఇరువైపులా మొక్కలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాయచోటి అండర్ బ్రిడ్జి పార్కు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, పార్కు మొత్తం మొక్కలు పెంచాలన్నారు. మాచుపల్లి రోడ్డులో డ్రైన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సంజన్న సర్కిల్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకూ డివైడర్‌లో మట్టి నింపి మొక్కలు నాటాలని సూచించారు. మధ్యాహ్నం ఆయన 48వ డివిజన్ రామరాజుపల్లె వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు అందించారు. డీఈలు కరిముల్లా ఖాన్, అబిద్ హుస్సేన్, ఏఈ మణిగోపాల్‌రెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేబీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



జేబీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సురేష్ బాబు, అహ్మద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలోని కొత్త బస్టాండు ఎదురుగా నూతనంగా నిర్మించిన జేబీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మేయర్ సురేష్ బాబు, హరూన్ బజాజ్ ఎండీ అహ్మద్ బాషా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక ఆర్థోపెడిక్ చికిత్సలు, రివిజన్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు, కీ హోల్ సర్జరీలు, కాంప్లెక్స్ ట్రామా కండీషన్లకు అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్లు ఈ హాస్పిటల్ ద్వారా అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కీళ్లమార్పిడి, కీ హోల్ సర్జన్ జహంగీర్ బాషా, హాస్పిటల్ ఎండీ జయభారతి మాట్లాడుతూ రాయలసీమలోనే మొట్ట మొదటిసారిగా రీ జనరేటివ్ ఆర్థోపెడిక్ సెంటర్, అడ్వాన్స్ రుమటలజీ సెంటర్ నెలకొల్పామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రక్తహీనత ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు



రికార్డులను పరిశీలిస్తున్న, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు

చెన్నూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాకుండా రక్తహీనత ఉన గర్భిణులు, ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలోని గర్భిణులు, బాలింతలను వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలని, ప్రతి ఇంటిలో నిల్వఉన్న నీటిని తొలగించి తిరిగి మంచినీరు నిల్వ ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలలో చెత్తాచెదారాలు లేకుండా చూసుకోవాలని, నీటి గుంతలు ఉంటే వాటిని పూడ్చివేయడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించిన ఆయన వైద్య సేవలను ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, ఎంపీహెచ్ ఈఓ ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పావని బెహన్‌జీ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లె సినీహబ్ సమీపంలోని ఓంశాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల సెట్టింగ్‌లను దర్శించాలని మోక్షగుండం ఓం శాంతి భవన నిర్వాహకురాలు బీకే పావని బెహన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జ్యోతిర్లింగాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు మోక్షగుండం వీధిలోని ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి మంగళవారం వరకు ద్వాదశజ్యోతిర్లింగాల సెట్టింగ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రముఖుల చేతుల మీదుగా ద్వాదశ జ్యోతిర్లింగాల సెట్టింగ్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అలాగే రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు నాట్యవిశారద మోహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన ఉంటుందన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శించు కోవచ్చని, ఉచిత ప్రవేశ మని భక్తులు పాల్గొని జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని శివ పరమాత్ముని అనుగ్రహం పొందాలని కోరారు. ఓం శాంతీలు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం

కలసపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా శుక్రవారం ఆయన సోదరులు ఎగువరామాపురం, లింగారెడ్డిపల్లె, కలసపాడు సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సచివాలయ వ్యవస్థ ద్వారా 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించి వారందరికి ప్రొబేషన్ కూడా డిక్లేర్ చేయడం జరిగిందని అన్నారు. పట్టభద్రులంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గురివిరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శన్, సచివాలయ కన్వీనర్ శేఖర్, మాజీ ఎంపీపీ సూదా రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మండల నాయకులు సుమన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.